క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకన్న

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన వనం సైదులు భార్య లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఓజో ఫౌండేషన్ అధినేత పిల్లుట్ల రఘు బుధవారం ఆ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వై.శివశంకర్‌యాదవ్, బి.సైదులు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా సన్నీ



బాధ్యతలు స్వీకరిస్తున్న సన్నీ

నేరేడుచర్ల : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యదర్శిగా సన్నీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనునాయక్ విధులు నిర్వర్తించారు. ఆయన స్థానంలో జిల్లా వ్యవసాయ కార్యాలయం నుంచి పదోన్నతిపై సన్నీ నూతన కార్యదర్శిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానన్నారు.

ఘనంగా కల్వరి కొండ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న జైపాల్‌రెడ్డి, ఫాదర్లు, తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారంలో కల్వరి కొండ (చర్చి) 20వ వార్షికోత్సవాన్ని విచారణ గురువులు రెవ ఫాదర్ తుమ్మా ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో ప్రదక్షిణ, దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం సాముల జైపాల్‌రెడ్డి (ఎన్‌ఆర్‌ఐ) అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదనంతరం క్రీడా పోటీలలో గెలపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్లు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



34వ వార్డులో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని 34వ వార్డులో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ పారా సీతయ్య, కౌన్సిలర్ గంధం యాదగిరి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఆవుదొడ్డి ధనమూర్తి, కుడుముల లక్ష్మీనారాయణ, కాంపాటి శ్రీను, పుల్లయ్య, ఆనంద్‌బాబు, యాకుబ్, రమేష్, సైదులు, వంశీ తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదస్థలాల పరిశీలన



ఆకుపాముల వద్ద ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ లోకేష్

మునగాల : జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశానుసారం మండలంలోని ఆకుపాముల, ముకుందాపురం గ్రామాల వద్ద జాతీయ రహదారిపై ప్రమాద స్థలాలను బుధవారం స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎమ్మార్, పలువురు దాతల సహకారంతో బారికేడ్లు, లైటింగ్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో హైవేపై ఉన్న సీసీ కెమెరాలను పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆకుపాముల సర్పంచ్ వెంకటేశ్వర్లు, జీఎమ్మార్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నజీమ్‌కు నివాళి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నజీమ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఆయన మృతదేహాన్ని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆమె వెంట శేషు, సలీం, అంబేద్కర్, భిక్షం తదితరులు ఉన్నారు.

‘పది’ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల హవా

కోదాడఅర్బన్ : తెలంగాణ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో కోదాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి సలీమ్ షరీఫ్ తెలిపారు. మండలంలో మొత్తం 18 పాఠశాలలు (ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను కలుపుకుని) ఉండగా మొత్తం 702 మందిలో బాలురు 254, బాలికలు 448 మంది పరీక్షకు హాజరుకాగా వారిలో 509 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కోదాడ బాలికల ఉన్నత పాఠశాల నుంచి నక్క అక్షర 9.8, కొండ రమ్య 9.8, కోదాడలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి బి.ద్వారకరాణి 9.8 గ్రేడ్‌తో టాపర్‌లుగా నిలిచారని తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో 99 శాతం ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు.

మండల టాపర్‌గా నిఖిల్‌సాయి

కోదాడరూరల్ : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని కూచిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నిఖిల్ సాయి 9.7 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

మునగాలలో 90.37 శాతం ఉత్తీర్ణత

మునగాల : పదవ తరగతి ఫలితాలలో మండలంలో 90.37 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి ఎండీ.సలీం షరీఫ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 11 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మూడు ప్రైవేటు పాఠశాలల నుంచి 374 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగ 338 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. స్థానిక మోడల్ స్కూల్‌లో 99 మంది విద్యార్థులకు 96 మంది ఉత్తీర్ణత సాధించారు.

నూరుశాతం ఉత్తీర్ణత

మునగాల : పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం తెలిపారు. 75 మంది విద్యార్థులకు గానూ నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కామళ్ల అవినాష్ 9.8 జీపీఏ సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, ఆర్.సాయి, కె.భాను 9.5 జీపీఏ సాధించి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. 22 మంది విద్యార్థులు 9.0 జీపీఏ సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.



కొండ రమ్య, 9.8 జీపీఏ



నిఖిల్‌సాయి, 9.7 జీపీఏ



కామళ్ల అవినాష్, 9.8 జీపీఏ



ఆర్.సాయి, 9.5 జీపీఏ



కె.భాను, 9.5 జీపీఏ

విజయభేరి మోగించిన బీసీ గురుకుల బాలుర విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు విజయభేరి మోగించారు. 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో దగ్గుపాటి జగదీశ్ 10/10 జీపీఏ, కీత అరవింద్ 10/10 జీపీఏ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.వెంకటప్పయ్య తెలిపారు. 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను గురుకుల సెక్రటరీ డాక్టర్ మల్లయ్య బట్టు, నల్లగొండ రీజియన్ కోఆర్డినేటర్ షకీన, సూర్యాపేట జిల్లా కన్వీనర్ అన్నపూర్ణలతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థి హవా

గరిడేపల్లి : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి తొడుసు నర్సింహారావు 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. గరిడేపల్లి మండలంలో 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వీరిలో 204 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి చత్రునాయక్ తెలిపారు. మండలం మొత్తంలో 75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.



సీహెచ్.వరలక్ష్మి, 9.5 జీపీఏ



వల్లపుదాసు రిషిత, 9.5 జీపీఏ

కస్తూరిబా గాంధీ విద్యార్థుల ప్రతిభ

పాలకవీడు : పదో తరగతి ఫలితాల్లో మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలోని బొత్తలపాలెం గ్రామానికి చెందిన వల్లపుదాసు రిషిత 9.5 జీపీఏ సాధించినట్లు పాఠశాల ఎస్‌ఓ సుజాత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు రిషితను అభినందించారు.

85.15 శాతం ఉత్తీర్ణత

నడిగూడెం : పదో తరగతి ఫలితాలలో నడిగూడెం మండలం విద్యార్థులు 85.15 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సలీం షరీఫ్ బుధవారం తెలిపారు. మొత్తం 330 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 281 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు డి.ప్రసన్న, ఎం.కావ్యశ్రీ, సిరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్.వరలక్ష్మి 9.5 జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు.

95.75 శాతం ఉత్తీర్ణత

మేళ్లచెరువు : పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని పాఠశాలల విద్యార్థులు 95.75 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ సైదానాయక్ తెలిపారు. మొత్తం 400 మంది విద్యార్థులు పరీక్ష రాయగా వారిలో 383 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సత్తా చాటిన విద్యార్థులు



కట్ల రక్షిత, 9.8 జీపీఏ



చల్లగిరి సౌజన్య, 9.7 జీపీఏ

హుజూర్‌నగర్ : పది పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పట్టణంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థిని కట్ల రక్షిత 9.8 జీపీఏ, వి.అమృత వర్షిణి, పి.గ్రీష్మలు 9.7 సాధించారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని చల్లగిరి సౌజన్య 9.7 జీపీఏ సాధించినట్లు ఎంఈఓ భూక్యా సైదానాయక్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 257 మంది విద్యార్థులకు 197 మంది ఉత్తీర్ణులు అయ్యారని, గురుకుల పాఠశాలలో 210 మందికి 208 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

చింతలపాలెం మండలంలో..

చింతలపాలెం మండల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ సైదానాయక్ తెలిపారు. మొత్తం 306 మందికి 276 మంది పాసైనట్లు చెప్పారు. మండలంలో 90.1 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఐదు పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత

అనంతగిరి : పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించినట్లు మండల విద్యాధికారి సలీం షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలవరం ఉన్నత పాఠశాలలో 25 మందికి 25 మంది, త్రిపురారం ఉన్నత పాఠశాలలో 18 మందికి 18 మంది, వాయల సింగారం పాఠశాలలో 15 మందికి 15 మంది, అమీనాబాద్ పాఠశాలలో 14 మందికి 14 మంది అనంతగిరి పాఠశాలలో 21 మందికి 21 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పాలవరం పాఠశాల నుంచి 9.7 జీపీఏతో పసపా వీరలక్ష్మి మండల టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. మండలం మొత్తంలో 151 మంది పరీక్షకు హాజరు కాగా 143 మంది ఉత్తీర్ణత సాధించి 95 శాతం ఫలితాలు సాధించారు.

మండల టాపర్‌గా మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డి, 9.8 జీపీఏ

చిలుకూరు : పదవ తరగతి ఫలితాల్లో మండలంలో 90.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మహేందర్‌రెడ్డి 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. అలాగే రామాపురం గురుకుల పాఠశాలకు చెందిన గోపి, కుశలంలు 9.7 జీపీఏ సాధించి మండల ద్వితీయ స్థానం సాధించారు. చిలుకూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 55 మంది విద్యార్థులకు అందరూ ఉత్తీర్ణత సాధించారు. జెర్రిపోతులగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10 మంది విద్యార్థులకు 10 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆచార్యులగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు అందరూ పాసయ్యారు. మండల వ్యాప్తంగా 244 మంది విద్యార్థులకు 222 మంది పాసయ్యారు. జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దు

- ఆర్డీఓ కిషోర్‌కుమార్

నడిగూడెం : తొమ్మిదవ హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీలను పకడ్బందీగా నిర్వహించాలని కోదాడ ఆర్డీఓ కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బృందావనపురం, వేణుగోపాలపురం గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహిస్తున్న నర్సరీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దని, ఎప్పటికప్పుడు నీరందించాలన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నందున ఇన్‌చార్జ్ అధికారులు నర్సరీలను పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట మండల పరిషత్ సూపరింటెండెంట్ ఇమామ్, బృందావనపురం సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య ఉన్నారు.



బృందావనపురంలో నర్సరీని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్‌కుమార్

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

మునగాల : ఈనెల 15వ తేదీ నుంచి 17 వరకు మండల స్థాయిలో నిర్వహించే చీఫ్ మినిస్టర్ కప్–2023 క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎలక బిందు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన క్రీడా పోటీల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 15 నుంచి 36 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీయువకులకు కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీ ఎండీ.ఆజాంబాబా వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భూపాల్‌రెడ్డి, జెడ్పీహెస్‌ఎస్ హెచ్‌ఎం డి.సీతారామరాజు, పీడీ ఎండీ.ఆజాంబాబా పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కప్ –2023 క్రీడలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15వ తేదీ నుంచి 17 వరకు మున్సిపాలిటీలోని రామాపురంలో గల బీసీ గురుకుల పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి విజేతలకు జిల్లా కేంద్రంలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు క్రీడలు ఉంటాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈఓ చత్రునాయక్, ఎస్‌ఐ నవీన్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, ఏసునాథం, హుస్సేన్, యాదగిరి తదితరులున్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలి

కోదాడరూరల్ : ఈ నెల 15 నుంచి 17వరకు మండల స్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా పోటీల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస శర్మ, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ నాగేశ్వరరావు, రాబిన్, రవి తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

పొనుగోడులో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. 15 నుంచి 36 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులని నిర్వాహకులు తెలిపారు.

సీఎం కప్ క్రీడల్లో పాల్గొనాలి

మోతె : గ్రామీణ ప్రాంతాల్లో 15 నుంచి 36 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు సీఎం కప్ క్రీడా టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చూపాలని ఎంపీపీ ముప్పాని ఆశా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడారు. యువకులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పాల్గొని తమ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు డీఆర్‌డీఓ పీడీ సూర్యాపేట కార్యాలయంలో సెల్ నెంబర్ 9848801646 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంఈఓ గోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992– 93వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదగిరి, కోటయ్య, పందిరి ప్రతాపరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర్సయ్య, అచల, శాస్త్రి, హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

మునగాల : మండలంలోని తాడువాయి శివారులో గల ఎర్రచెరువు, మోద్దుల చెరువులలో నిల్వ ఉన్న నీటిని అక్రమంగా మోటార్ల ద్వారా బయటకు తొలగిస్తున్న చెరువు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్ జవహర్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు భద్రంరాజు కృష్ణప్రసాద్, సామాజిక కార్యకర్త జిల్లేపల్లి వెంకటేశ్వర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులలో చేపలు పట్టుకునేందుకు సదరు కాంట్రాక్టర్ చెరువులో నీటిని మోటార్ల ద్వారా, తూములను పగలగొట్టి బయటకు తీస్తున్నారని దీంతో ఎండకాలం తాగునీటికి కటకట ఏర్పడే ప్రమాదముందన్నారు.

ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు..

తాడువాయి గ్రామానికి చెందిన లొడంగి వెంకటమ్మ బుధవారం మునగాల ఎస్‌ఐ పి.లోకేష్‌పై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తన వ్యవసాయ బావి నుంచి అక్రమంగా నీటిని తోడుతున్న చేపల కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా సదరు ఎస్‌ఐ.. కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతూ తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని బెదిరిస్తున్నాడని వినతిపత్రంలో ఆరోపించారు.

ఐశ్వర్య మృతికి న్యాయవాదుల సంతాపం

హుజూర్‌నగర్ : అమెరికాలోని డల్లాస్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి తాటికొండ నర్సిరెడ్డి కూతురు ఐశ్వర్య మృతి చెందడం పట్ల బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడి, సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. న్యాయమూర్తి టి.నర్సిరెడ్డి దంపతులకు, నేరేడుచర్ల మాజీ ఎంపీపీ రామనరసింహారెడ్డికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో జరిగే ఐశ్వర్య అంత్యక్రియలకు న్యాయవాదులు హాజరుకావాలని కోరారు.

నేరేడుచర్ల : అమెరికాలోని టెక్సాస్‌లో దుండగుల తూటాలకు బలైన రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి తాడికొండ నర్సిరెడ్డి కుమార్తె ఐశ్వర్య మృతి పట్ల హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గురువారం జరిగే అంత్యక్రియలకు న్యాయవాదులందరూ హాజరు కావాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామల రాంరెడ్డి తెలిపారు. ఐశ్వర్య తల్లిదండ్రులు తాటికొండ నర్సిరెడ్డి– అరుణ దంపతులకు, మాజీ ఎంపీపీ తాటికొండ రాంనర్సింహారెడ్డికి వారు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

‘కంటి వెలుగు’ సేవలపై ఆరా

మఠంపల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని వ్యాధి నిరోధక టీకాల జిల్లా అధికారి డాక్టర్ పి.వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని చౌటపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సుధాకర్‌నాయక్, హోమియో డాక్టర్ శ్రావ్య, సీహెచ్‌ఓ రాంకిషన్, కంటి వెలుగు కోఆర్డినేటర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, సరిత, హరీష్, రమేష్, లక్ష్మణ్, వీరస్వామి, సైదమ్మ, ప్రియాంక, ఆశా కార్యకర్తలు అరుణ, రజని, మాదవి, లింగమ్మ, ఉమ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం సర్పంచ్ దోసపాటి స్వరూప భిక్షం, ఎంపీటీసీ బల్లూరి సందీప్ అన్నారు. బుధవారం రాయినిగూడెంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరప్రసాద్, డాక్టర్ మౌనిక, అశోక్, నర్మద, గ్రామ కార్యదర్శి సురేష్, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశా వర్కర్లు సరిత, నాగమణి, అరుణ, రూప ఉన్నారు.



మఠంపల్లి : చౌటపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ పి.వెంకటరమణ

కేంద్రం విధానాలతో పేదల జీవితాలు దుర్భరం

హుజూర్‌నగర్‌రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో పేదల జీవితాలు దుర్భరంగా మారాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సీపీఐ ఇంటింటి ప్రచారంలో భాగంగా మండలంలోని లక్కవరంలో బుధవారం ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెరగడంతో పేదల జీవితాలు అస్తవ్యస్తంగా మారిపోయాయన్నారు. కడుపు మండిన ప్రజలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించే రోజు ఆసన్నమైందని తెలిపారు. అనంతరం ప్రజానాట్యమండలి, డప్పు కళాకారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను ఎంతగానో ఆకర్షించాయి. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పాలకూరి బాబు, కొప్పోజు సూర్యనారాయణ, బాదె నర్సయ్య, కందుల వెంకటేశ్వర్లు, సోను, వాసుదేవరావు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి దేశాన్ని పాలించే హక్కు లేదు

పాలకవీడు : బీజేపీ ప్రభుత్వానికి దేశాన్ని పాలించే హక్కు లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు అన్నారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బీజేపీ హటావో దేశ్‌కి బచావో అనే నినాదంతో బుధవారం చేపట్టిన ఇంటింటికీ సీపీఐ ప్రజాయాత్రను పాలకవీడులో ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్నికల హామీని విస్మరిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ముళ్ల జానయ్య, రావుల సత్యం, మరియన్న, బ్రహ్మం, వెంకటమ్మ, రమణ, సైదమ్మ పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : లక్కవరంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

ఈటల రాజేందర్ పరామర్శ



నాగలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

అనంతగిరి : మండల పరిధిలోని పాలారం గ్రామానికి చెందిన దొంతగాని నాగలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. బుధవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాలారం గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కార్యకర్తలు, మృతురాలి కుటుంబ సభ్యులు ఉన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సింహ



నర్సింహకు నియామకపత్రం అందజేస్తున్న అప్పం శ్రీనివాస్‌రావు

నేరేడుచర్ల : పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నేరేడుచర్లకు చెందిన చెరుకుపల్లి నర్సింహ నియమితులయ్యారు. బుధవారం నేరేడుచర్లలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్‌రావు.. నర్సింహకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ పద్మశాలిల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పద్మశాలి సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం నాయకులు గుర్రం మార్కెండేయ, ముశం నర్సింహ, పిల్లలమర్రి పుల్లారావు, గిరి, రమేష్, యుగేందర్, రమాదేవి, సావిత్రి, నాగేశ్వర్‌రావు, ఉపేందర్, సైదులు, శ్రీనివాస్, సోమశేఖర్, సత్యనారాయణ, చంద్రమౌళి, సతీష్, శేఖర్ ఉన్నారు.

రూ. 600 కూలి ఇవ్వాలి

మునగాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలకు రోజు కూలి రూ.600లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి పేద కూలీలకు దూరం చేస్తున్నాడని ఆరోపించారు. ఉపాధి కూలీలకు స్లిప్పుల ఆధారంగా వేతనం పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోంపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యుడు ఆరె.రామకృష్ణారెడ్డి, ఉపాధి హామీ మేట్లు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషనబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని అమరవరంలో ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలపై ఆయన మాట్లాడారు. చట్టప్రకారం వారం రోజులకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా నెలలు గడుస్తున్నా నేటికీ వేతనాలు చెల్లించకపోవడం అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సైదా, సీతరాములు, గోపి, నరిసింహారావు, సతీష్, నాగయ్య, ఉపాధి మేట్లు, కూలీలు ఉన్నారు.

జూనియర్ కార్యదర్శులను బెదిరించడం సరికాదు

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరైంది కాదని సీపీఎం మండల కార్యదర్శి యాకుబ్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు దోనేటి సుధాకర్, సైదులు, వెంకన్న, రామ్‌గౌడ్, బి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనం..

తమ సమస్యలు పరిష్కరించాలని గత పదకొండు రోజులుగా శాంతియుత దీక్ష చేస్తున్న జేపీఎస్‌లను తొలగిస్తామని ప్రభుత్వం బెదిరించడం ప్రభుత్వ నియంతృత్వానికి నిదర్శనమని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వెంకట్రాంపురం మాజీ సర్పంచ్ మృతి



జిల్లేపల్లి లక్ష్మమ్మ (ఫైల్)

మునగాల : మండలంలోని వెంకట్రాంపురం గ్రామ మాజీ సర్పంచ్ జిల్లేపల్లి లక్ష్మమ్మ (75) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. లక్ష్మమ్మ 1993లో సీపీఎం నుంచి సర్పంచ్‌గా గెలుపొందారు. కాగా లక్ష్మమ్మ మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ దొంగరి రమ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, నాయకులు సుంకర అజయ్‌కుమార్, ఎలక నరేందర్‌రెడ్డి, కోల ఉపేందర్‌రావు, దొంగరి శ్రీనివాస్, సోంపంగు గోపి, కాంగ్రెస్ నాయకులు గరిణె కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు బచ్చలకూర స్వరాజ్యం, సుందరయ్య, సాంబయ్య, నాగేంద్రబాబు పాల్గొన్నారు.